

ఫిబ్రవరికి రీ సర్వే పూర్తి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఫిబ్రవరి నాటికి రీ సర్వే పూర్తి చేయాలని సిసిఎల్ఎ కమిషనర్ సాయిప్రసాద్ కలెక్టర్‌ను ఆదేశించారు. జగనన్న శాశ్వత భూ హక్కుకు సంబంధించిన రీ సర్వే, మ్యుటేషన్లపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారుల అజయ్ కల్లంతో కలిసి మాట్లాడారు. గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసినా సమస్యలు ఉంటే రైతుల నుంచి దరఖాస్తులు వస్తే సవరణ చేయాలని చెప్పారు. రీ సర్వే అనంతరం కొలతరాళ్లు పని పూర్తి చేయాలన్నారు. భూ హక్కు, భూ రక్ష పథకం పథకం కింద సిఎం జగన్ పట్టాల పంపిణీ కార్యక్రమంపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.రాజేశ్వరి, సర్వే శాఖ ఎడి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధాన్యం కొనుగోళ్లు

- ఏర్పాట్లు చేసిన అధికారులు
- జలుమూరు, సారవకోట ఆర్‌బికెల్లో ప్రారంభం
- పౌర సరఫరాల సంస్థ కమిషనర్ అరుణ్‌కుమార్ రాక
- రైతులను వెంటాడుతున్న అల్పపీడన భయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి



జిల్లాలో శుక్రవారం నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కానున్నాయి. ఈనెల 19వ తేదీ నుంచి ప్రారంభించాలని తొలుత భావించినా ముఖ్యమంత్రి పర్యటనతో వాయిదా పడింది. పంట కోతలు ఊపందుకుంటున్న నేపథ్యంలో కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభ సూచకంగా తొలుత రెండు మండలాల్లో చేపట్టనున్నారు. ఇందుకోసం ధాన్యం సిద్ధంగా మండలాలను గుర్తించారు. జలుమూరులోని కరవంజ, చల్లవానిపేట, సారవకోట మండలంలోని మరో రెండు ఆర్‌బికెల్లో ప్రారంభించనున్నారు. ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పౌర సరఫరాల సంస్థ కమిషనర్ హెచ్.అరుణ్‌కుమార్ హాజరు కానున్నారు.

జిల్లాలో ఖరీఫ్‌లో 3,82,550 ఎకరాల్లో వరి సాగు అయింది. ఇందులో 3,75,518 ఎకరాల మేర ఈ-క్రాప్‌లో నమోదైంది. 8,11,120 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రైతుల సొంత అవసరాలు, ఇతర అమ్మకాలు పోనూ సుమారు 4.38 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అందుకనుగుణంగా సివిల్ సప్లై కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్లకు 371 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సంవత్సరం ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రమే తీసుకుంటామని ప్రభుత్వం చెప్పడంతో, అందుకనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని మిల్లర్లకు సూచించారు. జిల్లాలో 272 మిల్లులు ఉండగా ఇప్పటివరకు 166 మిల్లుల్లో ఫోర్టిఫైడ్ బియ్యం యంత్ర సామగ్రి ఉన్నట్లు తెలుస్తోంది. మరో 12 మంది మిల్లర్లు నాన్ సార్టెక్స్ బెండింగ్ మిషన్లు ఇప్పటికే ఏర్పాటు చేశారు. వీటిని జిల్లా పౌర సరఫరాల అధికారులు తనిఖీ చేయాల్సి ఉంది. 50 మంది వరకు యంత్ర సామగ్రి కోసం చూస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల నాటికి 250 మంది మిల్లర్ల వరకు యంత్ర సామగ్రిని సమకూర్చుకోగలరని అధికారులు చెప్తున్నారు.

జిల్లా పౌర సరఫరాల సంస్థ నంబర్లు

99634 79139
99634 79140
99634 79141

కంట్రోల్ రూమ్ నంబర్లు

9182183623
6301020758
9154294401
9177744402
8985406553
8801017060

సిబ్బంది నియామకం పూర్తి

ధాన్యం సేకరణలో పనిచేసే సాంకేతిక సిబ్బందికి సహాయంగా ఈ ఏడాది వాలంటీర్ల సేవలను తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అధికారులు ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఇద్దరు వాలంటీర్లను నియమించారు. వీరిలో కళ్లాం నుంచి వే బ్రిడ్జి ఒకరు, వే బ్రిడ్జి నుంచి మిల్లు వరకు మరొక వాలంటీరు విధులు నిర్వర్తిస్తారు. ఈ ప్రక్రియ కోసం మొత్తం 1200 మందిని నియమించారు. వీరితో పాటు ఒక్కో కొనుగోలు కేంద్రానికి ఒక టెక్నికల్ అసిస్టెంట్, డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమించారు.

ప్రొక్యూర్‌మెంట్ కమిటీలు ఏర్పాటు

ధాన్యం సేకరణకు సంబంధించి ప్రభుత్వం ఈ సంవత్సరం కొత్తగా మండల స్థాయి ప్రొక్యూర్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేస్తోంది. ఆ ప్రక్రియ ఇప్పటికే పూర్తయింది. అన్ని మండలాల్లో తహశీల్దార్ అధ్యక్షతన ఎంపిడిఒ, పౌరసరఫరాల డిటి, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, అగ్రికల్చర్ అధికారితో కూడిన కమిటీలు ఏర్పాటయ్యాయి.

కంట్రోల్‌రూమ్ ఏర్పాటు

ధాన్యం కొనుగోలులో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా కలెక్టరేట్‌లోని కంట్రోల్‌రూమ్ నంబర్లను సంప్రదించాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు దళారులు, మిల్లర్ల బారిన పడి నష్టపోకుండా రైతుభరోసా కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని కోరారు.

ఆందోళన కలిగిస్తున్న అల్పపీడనం

జిల్లాలో ఇప్పటికే అత్యధిక మండలాల్లో వరి కోతలు మొదలయ్యాయి. ఈ సమయంలో అల్పపీడన ప్రభావం రైతులను ఆందోళన కలిగిస్తోంది. గురువారం వాతావరణంలో ఆకస్మాత్తుగా వచ్చిన మార్పుతో అన్నదాతలు కలవరపాటుకు గురిచేసింది. జిల్లాలో పలు ప్రాంతాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి. లావేరు మండలంలో 5.25 మి.మీ, రణస్థలంలో 5 మి.మీ, జి.సిగడాంలో 2.5 మి.మీ, శ్రీకాకుళంలో 2.5 మి.మీ, పొందూరు పాతపట్నంలో 0.75 మి.మీ చొప్పున వర్షం కురిసింది. ఎచ్చెర్లలో 0.5 మి.మీ, కోటబొమ్మాళి, గారలో 0.25 మి.మీ చొప్పున వర్షం పడింది. కొన్నిచోట్ల పంట కోసి కుప్పలుగా పెట్టారు. తేలికపాటి జల్లులు పడడంత రైతులు పొలాలు, కళ్లాలకు పరుగులు తీశారు. ధాన్యం కుప్పలను పరదాలతో కప్పి కాపాడుకునే ప్రయత్నం చేశారు. ఈ దశలో ఏ మాత్రం వర్షం కురిసినా చేలోని పంటకు నష్టం తప్పదని రైతులు ఆందోళన చెందుతున్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిఐటియు నాయకులు

3, 4 తేదీల్లో సిఐటియు జిల్లా మహాసభలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

కార్మికుల సమస్యలపై సమరశీల పోరాటాలు చేస్తున్న సిఐటియు జిల్లా 11వ మహాసభలను డిసెంబరు 3, 4 తేదీల్లో శ్రీకాకుళం నగరంలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు తెలిపారు. మహాసభలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మహాసభల పోస్టర్‌ను నగరంలోని సిఐటియు జిల్లా కార్యాలయంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభల తొలి రోజు కార్మిక ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహాసభలకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అధ్యక్షులు సిహెచ్.నర్సింగరావు, ఎం.ఎ గఫూర్ హాజరు కానున్నారని తెలిపారు. గత పోరాటాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చించి రెండో రోజు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోనున్నట్లు చెప్పారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల శ్రమను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తుందని విమర్శించారు. త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కాలరాస్తూ యజమానులకు అనుకూలంగా 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి కార్మికులకు ద్రోహం చేసిందన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటలు మార్చేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 70 రంగాల్లోని కార్మికుల కనీస వేతనాలను 15 సంవత్సరాలు సవరించకపోవడంతో తీవ్ర శ్రమ దోపిడీకి గురవుతున్నారని, అతి తక్కువ వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల కష్టాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. షెడ్యూల్డ్ పరిశ్రమల్లోని లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు అమలు చేస్తే, రాష్ట్ర ప్రభుత్వంపై ఒక్క రూపాయి కూడా భారం పడదన్నారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వకుండా పనిభారం పెంచారని తెలిపారు. కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బిజెపి ప్రభుత్వ అడుగుజాడల్లో కేంద్ర ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కేంద్రం చేస్తున్న ప్రయివేటీకరణను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోకపోగా, ప్రధాని మోడీ విశాఖ వచ్చినప్పుడు సాదర స్వాగతం పలికి, ఆయన చెప్పిన కల్లిబొల్లి కబుర్లకు తలాడించిందని విమర్శించారు. ఐక్య పోరాటాలతో కార్మికవర్గం హక్కులు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.సురేష్‌బాబు, శ్రామిక మహిళా కన్వీనర్ కె.నాగమణి, సిహెచ్.అమ్మన్నాయుడు, ఎన్.షణ్ముఖరావు, ఎ.సత్యనారాయణ, ఎన్.వి.రమణ, డి.సుధ, ఎ.మహాలక్ష్మి, ఎన్.గణపతి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

పెండింగ్ బిల్లులు చెల్లించేటందుకు చర్యలు తీసుకోవాలని పంచాయతీ రాజ్, గ్రామీణాభివద్ధి శాఖ కమీషనర్ శశిధర్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. పరిశుభ్రత, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలపై గురువారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో పెండింగ్‌లో ఉన్న బిల్లులు, సిబ్బంది జీతాలు చెల్లించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించాలని చెప్పారు. గ్రామాల్లో పారిశుధ్య బాధ్యత సంబంధిత గ్రామ పంచాయతీలదేనని స్పష్టం చేశారు. 24 గంటల్లో బిల్లులు అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. పారవేసిన ప్లాస్టిక్ రీ సైక్లింగ్ చేసి పలురకాలుగా వినియోగించుకోవచ్చని చెప్పారు. మెటీరియల్ రికవరీ యూనిట్లను నియోజకవర్గానికి రెండు చొప్పున ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో సిఎం జగన్ పర్యటన విజయవంతం కావడంపై కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను అభినందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్, జెడ్‌పి సిఇఒ ఆర్.వెంకట్రామన్, డిపిఒ రవికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఇ సత్యనారాయణ మూర్తి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ ప్రసాదరావు, డ్వామా పీడీ చిట్టిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రకటనలకు మోసపోవద్దు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శిక్షణ ఇస్తామని గూగుల్‌లో వచ్చే ప్రకటనలకు మోసపోవద్దని జిల్లా ఆహార నియంత్రణాధికారి కోన వెంకటరత్నం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలో ఆహార పదార్థాలు, వ్యాపారస్తులు గూగుల్‌లో ప్రకటనలకు ఆకర్షితులై ఏ విధమైన డబ్బులు చెల్లించవద్దని తెలిపారు. జిల్లాలో శిక్షణ ఇచ్చేందుకు ఆన్‌లైన్‌లో గానీ, ఆఫ్‌లైన్‌లో గానీ ఎవరికీ ఏ విధమైన అనుమతులు లేవని స్పష్టం చేశారు. ఎవరికైనా అనుమానం ఉంటే జిల్లా ఆహార నియంత్రణాధికారి ఫోన్ నంబరు 9704009989 సంప్రదించాలని కోరారు.

ఉషు పోటీలకు సిక్కోలు క్రీడాకారులు



క్రీడాకారులతో అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఖేలో ఇండియా సౌత్ జోన్ నేషనల్స్ ఉషు పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారు. జిల్లా నుంచి రికార్డు స్థాయిలో ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీలు ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు కేరళ రాష్ట్రంలోని కాలికట్ వేదికగా నిర్వహించనున్నారు. పోటీలకు ఎంపికైన జిల్లా క్రీడాకారులు గురువారం ఇక్కడ నుంచి కాలికట్‌కు బయలుదేరి వెళ్లారు. వీరికి సెట్‌శ్రీ సిఇఒ బి.వి ప్రసాదరావు, ఉషు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పొగిరి కృష్ణంనాయుడు, రెడ్డి శివకుమార్ తదితరులు వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సౌత్ జోన్ నేషనల్స్ పోటీల్లో తుదివరకు పోరాడాలని, పతకాలతో జిల్లాకు తిరిగి రావాలని పిలుపునిచ్చారు. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.సుందరరావు మాట్లాడుతూ పోటీలకు రాష్ట్రం నుంచి మొత్తం 18మంది క్రీడాకారులు ఎంపిక కాగా, ఒక్క శ్రీకాకుళం జిల్లా నుంచే ఎనిమిది మంది క్రీడాకారులు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీ గవర్నర్ జి.ఇందిరాప్రసాద్, స్విమ్మింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ జిల్లా అధ్యక్షులు హారికా ప్రసాద్, ఎస్.జోగినాయుడు, తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు కొమర భాస్కర్, కురిటి తారకరామ, రెడ్డి సాయికుమార్, ఎ.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు వీరే

జిల్లా నుంచి సబ్ జూనియర్ విభాగంలో 27 కేజీల విభాగంలో పి.యషిత, బి.దేవీప్రియ, 39 కేజీల విభాగంలో టి.ఝాన్సీ, 45 కేజీల విభాగంలో ఆర్.తన్మయ్, 48 కేజీల విభాగంలో లాస్యవర్షిత ఎంపికయ్యారు. జూనియర్స్ విభాగంలో ఎంపికైన క్రీడాకారుల్లో 56 కేజీల విభాగంలో ఆర్.పావని, 60 కేజీల విభాగంలో ముద్దాడ శిరీష, సీనియర్స్ విభాగంలో 45 కేజీల విభాగంలో కె.సౌజన్య ఎంపికైన వారిలో ఉన్నారు.

నాణ్యత, పరిమాణం తప్పనిసరి

విజిలెన్స్ డిప్యూటీ కంట్రోలర్ నాదముని



తనిఖీలు చేస్తున్న జెసి సభ్యులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

జిల్లాలో పౌర సరఫరాల శాఖ ద్వారా ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపిణీ చేస్తున్న సరుకుల్లో నాణ్యత, పరిమాణాలను కచ్చితంగా పాటించాలని విజిలెన్స్ డిప్యూటీ కంట్రోలర్ నాదముని సంబంధిత అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని మండల నిత్యావసర సరుకుల గోదామును జాయింట్ యాక్షన్ టీమ్‌తో కలిసి గురువారం పరిశీలించారు. నాణ్యత, పరిమాణాల్లో తేడా ఉండరాదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రతి అధికారి గమనంలో ఉంచుకోవాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్లు, బఫర్ గోదాముల వద్ద బియ్యం నాణ్యత, పరిమాణాన్ని తనిఖీ చేసేందుకు ప్రభుత్వం జిల్లాస్థాయి కమిటీని ఏర్పాటు చేసిందని తెలిపారు. అందులో భాగంగా ఎంఎల్ఎస్ పాయింట్లను, బఫర్ గోదామును పరిశీలించామన్నారు. ప్రతినెలా పరిశీలిస్తామని, తనిఖీల్లో అవకతవకలకు పాల్పడినట్లు తేలితే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. పర్యటనలో జాయింట్ యాక్షన్ టీమ్ సభ్యులు ఎఫ్‌సిఐ మేనేజర్ లక్ష్మీభవాని, జిల్లా సరఫరాల అధికారి డి.వి రమణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, పౌర సరఫరాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జన సంద్రం



ఇచ్ఛాపురం పీర్లకొండపై నిర్వహించే పీర్లోత్సవం వివిధ రాష్ట్రాల నుంచి వచ్చే యాత్రికులతో భక్త జన సంద్రంగా మారింది. మత సామరస్యానికి ప్రతీగా నిలిచే ఈ పండగను హిందువులు, ముస్లీములు కలిసి జరుపుకుంటారు. పండగ ముస్లీములదైనప్పటికీ కొండపై తొలి మెట్టు వద్ద హిందువులు కొబ్బరికాయ కొట్టి, దీపాలు వెలిగించడం విశేషం. భారీగా జనం రావడంతో స్టేషన్ రోడ్డు, రత్తకన్న రోడ్డు రద్దీగా మారింది. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా సిఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యాన ఎస్ఐ గోవిందరావు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

- ప్రజాశక్తి, ఇచ్ఛాపురం

రైతు భరోసా కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోళ్లు

ప్రజాశక్తి - జలుమూరు

రైతు భరోసా కేంద్రాల వద్ద ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. ఖరీఫ్-2022కు సంబంధించి జిల్లాలో మొట్టమొదటిగా పాగోడు ఆర్‌బికెలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. రైతు దామ భాస్కరరావు కళ్లం వద్ద ఆయన కొనుగోలు చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణదాస్ మాట్లాడుతూ ఈ సంవత్సరం ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు మేలు జరిగే విధంగా సిఎం జగన్ సమూల మార్పులు చేశారన్నారు. ఏ రైతు కూడా దళారులను ఆశ్రయించకుండా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారానే కొనుగోలు చేయటానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ధాన్యం అమ్మేందుకు సిద్ధంగా ఉన్న రైతులు రైతు భరోసా కేంద్రాల ద్వారా కూపను తీసుకున్నాక, కొనుగోలు సిబ్బంది రైతు కళ్లాల వద్దకే వచ్చి నాణ్యతా ప్రమాణాలు నిర్ధారించుకొని టెక్నికల్ అసిస్టెంట్, వాలంటీర్ల సమక్షంలో తూకం వేయించి రైస్ మిల్లులకు చేరవేయటం జరుగుతుందన్నారు. దళారుల ప్రమేయం లేకుండా రైతుల ధాన్యం సిస్టం జనరేటర్ మిల్లుకు మాత్రమే చేరవేయబడుతుందని చెప్పారు. రైతులు ఎవరూ ముందుగా మిల్లులకు ధాన్యం చేరవేయవద్దని సూచించారు. రైతులు ఏ మిల్లర్లను సంప్రదించాల్సిన అవసరం లేదన్నారు. రైతు గోనె సంచులు, హమాలి, రవాణా ఛార్జీలు భరించినట్లయితే 21 రోజుల్లోపు ధాన్యం మద్దతు ధరతో పాటు వారి అకౌంట్లో డబ్బులు జమ అవుతాయన్నారు.

అధికారుల గైర్హాజరు

పాగోడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించేందుకు ఉదయం 10 గంటలకు ధర్మాన కృష్ణదాస్ చేరుకోగా, పౌరసరఫరాల శాఖ అధికారులు మాత్రం గైర్హాజరయ్యారు. పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ పి.జయంతి కోసం ఆయన ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆమె ఎప్పటికీ చేరుకోకపోవడంతో ఎమ్మెల్యే ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి, వెళ్లిపోయారు. జిల్లాలోనే మొట్టమొదటిగా జలుమూరు మండలంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభానికి ఆదిలోనే హంసపాదులా.. ఆ శాఖ అధికారులే ప్రజాప్రతినిధుల కంటే ఆలస్యంగా రావడంపై ఎంపిపి వాన గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ దామ మన్మథరావు, అల్లాడ పిఎసిఎస్ అధ్యక్షులు పొన్నాన ముసలినాయుడు, ఎంపిటిసి రావాడ చందన, వైస్ ఎంపిపి తంగి మురళీకృష్ణ, దరివాడ సర్పంచ్ పైడి విఠల్‌రావు, కరవంజ సర్పంచ్ జుత్తు నేతాజీ, చెన్నాయివలస సర్పంచ్ బొమ్మాళి ప్రసాద్, ఎఒ కె.సురేష్, సివిల్ సప్లై డిటి గణేష్, ఎఎంటి సృజన, శంకర రావు, రైతులు పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కృష్ణదాస్

వైసిపివి స్కీమ్‌లు... టిడిపివి స్కామ్‌లు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - నరసన్నపేట

వైసిపి పాలనలో ప్రజల కోసం స్కీమ్‌లు ప్రవేశపెడితే, టిడిపి పాలనలో స్కామ్‌లు జరిగాయని ఎమ్మెల్యే, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. మండల కేంద్రంలోని వైసిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బాధ్యత గల ప్రతిపక్షంగా ఏనాడూ టిడిపి వ్యవహరించలేకపోయిందన్నారు. భావితరాల కోసం ఆలోచన చేస్తున్న నాయకుడు జగన్ అని కొనియాడారు. ఆయనపై అక్కసు, అసూయ టిడిపి నేతల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రిమ్స్, యూనివర్సిటీ, వంశధార ప్రాజెక్టు, కరకట్టలు, ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో చేపట్టిన ఘనత వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందన్నారు. అటువంటి ఆలోచనలే జగన్‌లోనూ ఉన్నాయని చెప్పారు. ఉద్దానం మంచినీటి పథకం, కిడ్నీ రీసెర్చ్ సెంటర్, భావనపాడు పోర్టు నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయితే జిల్లా రూపురేఖలే మారిపోతాయన్నారు. నరసన్నపేట ప్రజలు వైసిపిపై విశ్వాసం ఉంచారని, అందుకే గడిచిన ఎన్నికల్లో జిల్లాలోనే అత్యధిక మెజారిటీతో తనను గెలిపించారన్నారు. సర్పంచ్ ఎన్నికల్లో నరసన్నపేట మేజర్ పంచాయతీ రాష్ట్రంలోనే అత్యధిక మెజారిటీల జాబితాలో నిలిచిందన్నారు. టిడిపి నేతలు శిలాఫలకాలు వేసి గాలికొదిలేస్తే ఆ పనులను తాను పూర్తి చేశానని చెప్పారు. విశాఖలో రాజధాని ఏర్పాటును ప్రజలు స్వాగతిస్తున్నారని, టిడిపి, జనసేనలు మాత్రం దాన్ని అడ్డుకోవడానికి కుట్రలు చేస్తున్నాయన్నారు. శ్రీకాకుళంను రాజధాని చేయాలని ఎంపీ రామ్మోహన్ నాయుడు మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రెండుసార్లు ఎంపీగా గెలిపించిన జిల్లా ప్రజలకు ఆయన చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. ఉత్తరాంధ్ర వెనుకబడిన ప్రాంతం కాదని, నిర్లక్ష్యానికి గురైన ప్రాంతమన్నారు. దాని అభివృద్ధికి జగన్ కృషి చేస్తుంటే అడ్డు తగలడం సరికాదన్నారు. సిఎం పర్యటన సందర్భంగా నరసన్నపేటను అష్టదిగ్బంధనం చేశామని, బలవంతంగా షాపులు మూయించామని టిడిపి నేతలు ప్రచారం చేయడం సరికాదన్నారు. వాస్తవాలేమిటో ప్రజలకు తెలుసునన్నారు. సమావేశంలో డిసిసిబి ఛైర్మన్ కె.రాజేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ అంధవరపు సూరిబాబు, ఎంపిపి ఆరంగి మురళీధర్, సుడా ఛైర్‌పర్సన్ ప్రతినిధి కె.చంద్రభూషణ్ గుప్త తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ధర్మాన కృష్ణదాస్

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

ఎంపీ, అచ్చెన్నకు సవాల్ విసిరిన అప్పలరాజు

ప్రజాశక్తి - పలాస

సుదీర్ఘ కాలం పాటు పదవుల్లో ఉన్న కింజరాపు కుటుంబం చరిత్రలో చెప్పుకునేందుకు జిల్లా ప్రజల కోసం చేసిన అభివృద్ధి ఏమైనా ఉందా? ఊకదంపుడు ఉపన్యాసాలు తప్ప, చేసిందేమీ లేదని రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఆరోపించారు. ప్రతిపక్షాలు నాపై ఎన్ని ఆరోపణలు చేసినా, ఎన్ని కుట్రలు పన్నినా ఎవరూ ఏమీ చేయలేరని అప్పలరాజు ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని బ్రాహ్మణతర్ల గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ఉప సర్పంచ్ పోందర ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో మంత్రి అప్పలరాజు మాట్లాడారు. అభివృద్ధిపై చర్చకు నువ్వు వస్తావా..., లేక మీ బాబాయ్ వస్తారా.. తేల్చుకోవాలంటూ ఎంపీ రామ్మోహన్‌నాయుడుకు సవాల్ విసిరారు. సుదీర్ఘ కాలం పాటు జిల్లాను పాలించిన టిడిపి నేతలు తమ వ్యాపారం, పరపతి పెంచుకోవడానికి తప్ప, ప్రజల కోసం ఏమీ చేయలేదన్నారు. కీలకమైన భావనపాడు పోర్టు, హార్బర్‌కు శంకుస్థాపన చేయనున్నామని చెప్పారు. టెక్కలి ప్రాంతంలో గత టిడిపి ప్రభుత్వం కాలంలో కింజరాపు అచ్చెన్నాయుడు అనధికారంగా, దౌర్జన్యంగా లిఫ్ట్ ఇరిగేషన్‌లు పెట్టడంతో వంశధార శివారు రైతులైన పలాస, వజ్రపుకొత్తూరు భూములకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లోకి కింజరాపు కుటుంబానికి చెందిన వ్యక్తులు వస్తే రైతులు చొక్కా పట్టుకొని నిలదీయాలని పిలుపునిచ్చారు. వంశధార శివారు భూముల రైతులకు న్యాయం చేసేందుకు శాశ్వత పరిష్కారం కోసం టెక్కలి మదనగోపాల్ సాగరం బైపాస్ చేయడానికి సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్లామని వివరించారు. ఈ సమస్యకు కొద్ది రోజుల్లో శాశ్వత పరిష్కారం దొరకబోతుందన్నారు. బ్రాహ్మణతర్లాకు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం బ్రాహ్మణతర్ల ఉన్నత పాఠశాల అప్ గ్రేడ్‌లో భాగంగా బాలికల జూనియర్ కళాశాలను ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులతో మమేకమయ్యారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు హనుమంతు వెంకటరావు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, సాయికృష్ణ, దంతం వైకుంఠరావు, చింతాడ మాధవరావు, బాడాన పుష్పలత, తలగాన రవణమ్మ, దేశయ్య, మదన్, తిరుమలరావు, సంతోష్‌కుమార్, రవికుమార్, షణ్ముఖరావు, తదితరులు పాల్గొన్నారు.



బాలికల జూనియర్ కళాశాల ప్రారంభిస్తున్న మంత్రి అప్పలరాజు

పోరాటాలతోనే ఎస్‌సి వర్గీకరణ

ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఎస్‌సి వర్గీకరణకు పోరాటాలకు సిద్ధం కావాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ మున్నంగి నాగరాజు పిలుపునిచ్చారు. నగరంలోని ఎన్‌జిఒ హోంలో గురువారం నిర్వహించిన ఎంఆర్‌పిఎస్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిదేళ్లు పూర్తయినా ఎస్‌సి రిజర్వేషన్ వర్గీకరణపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే వర్గీకరణ చేస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు. మాదిగలను నమ్మించి బిజెపి మోసం చేసిందన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు వర్గీకరణకు అనుకూలంగా తమ మద్దతును ప్రకటించినా మోడీ ప్రభుత్వం మాత్రం వెనకడుగు వేస్తోందన్నారు. ప్రజల నుంచి ఎలాంటి డిమాండ్ లేకుండానే ఆర్టికల్ 370, రామ మందిరం నిర్మాణానికి శ్రీకారం చుట్టారని, అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించారని చెప్పారు. గతంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ ఉషా మెహ్రా కమిషన్, రాష్ట్ర ప్రభుత్వం నియమించిన జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ వర్గీకరణకు అనుకూలంగా నివేదికలు ఇచ్చాయని చెప్పారు. సమావేశంలో ఎంఆర్‌పిఎస్ జిల్లా ఇన్‌ఛార్జి రాణా శ్రీనివాస్ మాదిగ, జిల్లా వ్యవస్థాపక సభ్యులు బోస్ మన్మథరావు, నాయకులు దాసరి తిరుమలరావు, కె.సుదర్శనరావు, కె.హిమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



ఆర్‌డిఒ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న వామపక్ష నాయకులు

రైతుల భూముల లాక్కోవడం దారుణం

ప్రజాశక్తి- పలాస

జగనన్న ఇళ్ల కాలనీ కోసం బొడ్డపాడులోని సర్వే నెంబరు 76, 77లోని రైతుల భూములను లాక్కోవడం దారుణమని సిపిఎం నాయకులు ఎన్.మోహనరావు, ఎపి కౌలుదారుల సంఘం నాయకులు బి.ఆనందరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు వాసుదేవరావు అన్నారు. తక్షణమే రైతులకు భూములను అప్పగించాలని, లేదా పరిహారం ఇవ్వాలని కోరుతూ ఆర్‌డిఒ కార్యాలయం వద్ద గురువారం ధర్నా చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ సీతారామ్మూర్తికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూములకు నష్టపరిహారం ఇవ్వకుండా, రైతుల భూములను ప్రభుత్వం ఎలా తీసుకుంటుందని ప్రశ్నించారు. ఆర్‌డిఒ ప్రకారం అడిగితే ఈ సర్వే నెంబర్‌లో ఏ రకమైన భూ సేకరణ చేయలేదని కలెక్టర్, ఆర్‌డిఒ సమాధానం ఇచ్చారని చెప్పారు. అయినప్పటికీ ఇళ్ల నిర్మాణం కోసం పునాదులు ఎలా వేశారని వారు ప్రశ్నించారు. కార్యక్రమంలో వ్యకాస నాయకులు డి.భాస్కరరావు, ఎపి గ్రామీణ కార్మిక సంఘం జిల్లా నాయకులు వంకల అప్పయ్య, గేదెల జానకిరావు, గీతమ్మ, రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం, పలాసలో నిర్మాణంలో ఉన్న జగనన్న ఇళ్ల కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డిఒ బి.సీతారామ్మూర్తికి అర్బన్ హౌసింగ్ స్పెషల్ డెవలప్‌మెంట్ అధికారి చెన్నారు మల్లేశ్వరరావు వినతిపత్రం అందించారు. జగనన్న ఇళ్ల కాలనీలో నిర్మాణాలు డిసెంబరు 21 నాటికి పూర్తి చేయాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న టిడిపి నాయకులు

డాక్టర్ కృష్ణారావుకు అభినందనలు

వజ్రపుకొత్తూరు: టిడిపి రాష్ట్ర బిసి సాధికార సమితి సభ్యులుగా నియమించబడిన ప్రముఖ వైద్యులు డాక్టర్ దున్న కృష్ణారావును విద్యావేత్త, జుత్తు తాతారావు గురువారం పూండిలో కలిసి అభినందనలు తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయాలపై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్రంలో వైసిపి అరాచక పాలనకు చరమగీతం పాడి చంద్రబాబు ముఖ్యమంత్రి కావాల్సిన అవసరం ఉందన్నారు. టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపు మేరకు జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు సమక్షంలో టిడిపిలో చేరి పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని అన్నారు. పార్టీ ఏ బాధ్యత అప్పగించినా ఒక సైనికుడిగా పని చేయడానికి సిద్ధమేనని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సివంగి వాసు, సార రవికుమార్, రెయ్యి నారాయణరావు, బత్తిని భాస్కరరావు, తాళ్ల మురళి, బత్తిని గణపతి, కలిశెట్టి గురుమూర్తి, ఎ.నారాయణ, బి.హేమారావు, కె.శ్యామ్, తిమ్మల గిరి, మధుర పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

లీడ్ బ్యాంకు మేనేజర్ హరిప్రసాద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

బ్యాంకు ఖాతాల నుంచి నగదు చౌర్యం, ఆన్‌లైన్ మోసాలు, ఫోన్ కాలింగ్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అవగాహన పెంచుకోవాలని లీడ్ బ్యాంకు మేనేజర్ జి.వి.బి.డి.హరిప్రసాద్ కోరారు. ఐసిఐసిఐ బ్యాంకు సహకారంతో నగరంలోని ప్రయివేటు అతిథి గృహంలో జాతీయ సమగ్ర అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాంకేతికంగా అభివృద్ధి చెందిన తర్వాత బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు సులభ తరమయ్యాయన్నారు. అయితే బ్యాంకు ఖాతాల భద్రతపై తగిన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నట్టు నమ్మించి వివరాలు అడుగుతున్నప్పుడు ఏమర పాటుతో కొందరు పూర్తి వివరాలు చెప్పేస్తున్నారని, అటువంటి కాల్స్ వచ్చినప్పుడు వెంటనే అప్రమత్తం కావాలని సూచించారు. బ్యాంకు వివరాలు అడిగినప్పుడు వెంటనే ఆ ఫోన్ నంబరును గుర్తించాలన్నారు. అనంతరం ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మన్యం లీడ్ బ్యాంకు మేనేజర్



పోలాకి : మాట్లాడుతున్న ఎస్ఐ నరసింహమూర్తి



శ్రీకాకుళం అర్బన్ : మాట్లాడుతున్న హరిప్రసాద్

జె.ఎల్.ఎన్.మూర్తి, మెప్మా పీడీ ఎం.కిరణ్ కుమార్, ఐసిఐసిఐ రీజనల్ మేనేజర్ మామిడి నరసింహమూర్తి, ఎపిజివిబి రీజినల్ మేనేజర్ సుధాకర్, ఐసిఐసిఐ బ్రాంచ్ మేనేజర్ మెట్ట చంద్రశేఖర్, కొండలరావు, ఎపి టిడ్కో జిల్లా హెడ్ కె.ఎస్.ఎన్.మూర్తి, ఎస్‌బిఐ చీఫ్ మేనేజర్ సోమేశేఖర్, ఎఎల్‌డిఎం ఎన్.వి.రమణ, సైబర్ క్రైమ్ అధికారి సత్య, డిసిసిబి సిఇఒ వరప్రసాద్, గిరిజాశంకర్ పాల్గొన్నారు.

పోలాకి: నగదు లావాదేవీలపై ఎక్కువగా ఆన్‌లైన్‌లో మోసాలు జరుగుతున్నాయని, డిజిటల్ లావాదేవీలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ నరసింహమూర్తి సూచించారు. గురువారం నరసాపురంలోని స్టేట్ బ్యాంకు కార్యాలయంలో మేనేజరు సంధ్యారాణి ఆధ్వర్యాన డిజిటల్ లావాదేవీలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ ఈశ్వరరావు, ఎస్ఐ నరసింహమూర్తి మాట్లాడుతూ సమాజంలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని అన్నారు. వాటిని ఎలా నివారించాలి అన్నదానిపై అవగాహన కల్పించారు. బ్యాంకులు, కస్టమర్ కేర్ నుంచి ఫోన్ చేస్తున్నాం, మీ ఫోన్‌కు వచ్చిన ఒటిపి, మీ బ్యాంకు ఖాతా చెప్పాలని ఎవరైనా కోరితే మీ వ్యక్తిగత సమాచారం ఇవ్వకూడదని అన్నారు. ఎవరైనా మోసాలు చేసేందుకు ఫోన్ చేస్తే 1930కు ఫోన్ చేసి, ఫిర్యాదు చేయాలని కోరారు. రుణ యాప్‌ల ద్వారా లోన్‌లు తీసుకోకపోవడమే ఉత్తమమని అన్నారు. సైబర్ నేరగాళ్లు ఆండ్రాయిడ్ ఫోన్లకు లింకులు పంపి, మోసాలకు పాల్పడుతున్నారని చెప్పారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం బిఎం సంధ్యారాణి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన ఇన్సురెన్స్ పథకాలు, అటల్ పెన్షన్ స్కీమ్ నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారులు ఎ.రమణమూర్తి, సిహెచ్ షన్ముఖరావు, వై.రాము, సత్యనారాయణ, గణేష్, ఖాతాదారులు పాల్గొన్నారు.

మెళియాపుట్టి: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని చాపరా ఎపిజివిబి మేనేజర్ అభిషయ్ కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం సైబర్ నేరాలపై డ్వాక్రా విఒఎలు, సిసిలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఎటువంటి ఫోన్ నెంబర్లు, ఒటిపి అడిగినా చెప్పవద్దని అన్నారు. ఖాతాదారుడు తన సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు తెలుపవద్దని, గోప్యంగా ఉంచుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, ఎపిఎం లలిత, బ్యాంకు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి : అవగాహన కల్పిస్తున్న అధికారులు

విద్యార్థులకు క్రీడా పరికరాలు

సంతబొమ్మాళి: మండలంలోని జగన్నాథపురం పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ జోగి రాములమ్మ, ఎంపిటిసి జొన్న సవరరాజు హ్యాండ్ బాల్, క్రికెట్ కిట్, వాలీబాల్ కిట్, చెస్ బోర్డ్, తదితర క్రీడా సామాగ్రిని వితరణగా అందజేశారు. విద్యార్థులకు క్రీడా పరికరాలు అందజేసిన సర్పంచ్ రాముల మ్మకు, ఎంపిటిసి సవర రాజుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు.ఎస్‌బి కొత్తూరు సర్పంచ్ ప్రతినిధి లోకనాథం, హెచ్‌ఎం కంఠయ్య పాల్గొన్నారు.



ప్రజాప్రతినిధులను సన్మానం చేస్తున్న సిబ్బంది



మాట్లాడుతున్న దాసరి రాజు

సిఎం వ్యాఖ్యలు సరికాదు

ఇచ్ఛాపురం: ఉద్దానం కిడ్నీ బాధితుల విషయంలో జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌పై సిఎం జగన్ చేసన వ్యాఖ్యలను జనసేన ఇచ్ఛాపురం నియోజకవర్గ అధ్యక్షులు దాసరి రాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఉద్దానం కిడ్నీ సమస్యపై ఏ నాయకుడూ స్పందించలేదని, కానీ 2017 జనవరి 3న పవన్ ఇచ్ఛాపురం వచ్చి కిడ్నీ రోగులతో సమావేశమై, వారి బాధలను తెలుసుకున్నారని అన్నారు. వారి సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధించారని గుర్తుచేశారు. డయాలసిస్ రోగులు వేలల్లో ఉంటే వందలాది మందికే పింఛను అందుతోందని చెప్పారు. ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులకు రూ.10 నుంచి రూ.15వేలు జీతం వస్తే వారి ఇళ్లలోని రోగులకు డయాలసిస్ వర్తించకుండా చేశారని వాపోయారు. కిడ్నీ రోగులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న జగన్ పవన్‌ను విమర్శించడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సమావేశంలో తిప్పన దుర్యోధనరెడ్డి, సంతోష్ మహరణ, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

నిరంతర తాగునీటి సరఫరా

ప్రజాశక్తి- కంచిలి

మండలంలోని తలతంపర పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో నిరంతర తాగునీటి సరఫరాకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు సర్పంచ్ డాక్టర్ జగబంధు దొలాయి తెలిపారు. పంచాయతీలోని కాకర్లపుట్టుగలో రెండు వేల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన మూడు ట్యాంకులతో తాగునీటి కుళాయిలను గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీలో తాగునీరు కల్పన, పారిశుధ్యం, రహదారుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు, యువత సహకారంతో పంచాయతీలో అభివృద్ధి ప నులు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిటిసి బృందావన్ సాహు, గ్రామ పెద్దలు సన్యాసి ధనుంజయ, ఆదినారాయణ, నీలాంబర్, తదితరులు పాల్గొన్నారు.



కుళాయిలను ప్రారంభిస్తున్న సర్పంచ్ జగబందు దొలాయి



దెబ్బతిన్న బోటు

సముద్రంలో బోటు బోల్తా
మత్స్యకారులు సురక్షితం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

సముద్రంలో చేపలు వేటకు వెళ్లిన మత్స్యకారుల బోటు బోల్తా పడిన ప్రమాదంలో ప్రాణనష్టం జరగకుండా సురక్షితంగా ఒడ్డుకు చేరడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. మంతినీళ్లపేటకు చెందిన మత్స్యకారులు పరిమెల్ల చిన్నారావు, సోడిపిల్లి భైరాగి, లండ గణపతి, పి.దేవరాజ్, ధనరాజ్, ఎస్.రాజు, తాతారావులతో పాటు మరో ముగ్గురు బుధవారం సాయంత్రం సముద్రంలో చేపల వేటకు బయలుదేరి వెళ్లారు. వేట ముగించుకొని తిరిగి ఒడ్డుకు చేరు సమయంలో బుధవారం అర్ధరాత్రి పెద్ద కెరడం రావడంతో బోటు ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో మత్స్యకారులు చెల్లాచెదురుగా పడిపోయారు. అంధకారం, ఏమైందో తెలియని అయోమయంతో బాధితులు ప్రాణాలు అరచేత పట్టుకొని ఈత కొడుతూ సురక్షితంగా వజ్రపుకొత్తూరు తీరంలోని మంకినమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. పెను ప్రమాదం తప్పడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాగా, రాకాసి అలలకు బోటుతో పాటు వలలు ధ్వంసం కావడంతో రూ.15 లక్షల ఆస్తి నష్టం సంభవించిన మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేశారు. తీరంలో కొంత దూరంలో చిక్కుకున్న బోటును యంత్రాల సాయంతో గురువారం ఒడ్డుకు తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో నష్టపోయిన మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.



దగ్ధమవుతున్న పూరిళ్లు

మర్రివలసలో రెండు ఇళ్లు దగ్ధం

జి.సిగడాం : మండలంలోని మర్రివలసలో గురువారం సంభవించిన అగ్నిప్రమాదంలో షేక్ జైనాబీ, షేక్ బిబిలకు చెందిన ఇళ్లు దగ్ధమయ్యాయి. డ్వాక్రాలో అప్పు తీసుకున్న డబ్బులు రూ.50 వేలు చొప్పున కాలిపోవడంతో బాధితులు కన్నీటిపర్యంతమవుతున్నారు. వంట చేస్తుండగా... గ్యాస్ నుంచి ఒక్కసారిగా మంటలు రావడంతో ఇల్లంతా వ్యాపించి, పక్కనే ఉన్న మరో ఇంటికి నిప్పంటుకుంది. వెంటనే స్థానికులు రాజాం అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందజేశారు. సిబ్బంది శకటంతో వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో దుస్తులు, తిండి గింజలు, విద్యుత్, ఆధార్ తదితర వస్తువులు కాలిపోయాయి. ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



సమ్మిట్‌లో పాల్గొన్న శివగంగాధర్

జిల్లావాసికి అరుదైన గౌరవం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని అరసవల్లికి చెందిన గుండ శివగంగాధర్‌కు అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ వాతావరణంపై చర్చించి భూతాపం తగ్గించడానికి ఇటీవల ఈజిప్ట్‌లోని షర్మఎల్ షేక్ రిసార్ట్‌లో నిర్మించిన సమ్మిట్‌లో అమెరికా తరపున ఆయన పాల్గొన్నారు. 147 దేశాల ప్రతినిధులు హాజరైన ఈ సమ్మిట్‌కు కాఫ్ 27గా నామకరణం చేశారు. ఇందులో అమెరికా తరపున హాజరైన బృందం లో వైస్ చైర్మన్ ఎనర్జీ కమిషన్, ఎన్విరాన్మెంటల్ కాలిఫోర్నియా తరపున గుండ శివగంగాధర్ పాల్గొన్నారు. ఆయన మాజీ మంత్రి గుండ అప్పల సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి, వీరి కుమారుడు శివగంగాధర్‌కు ప్రశంసించారు.



తిలక్‌ను పరామర్శిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

తిలక్‌కు జెడ్‌పి చైర్‌పర్సన్ పరామర్శ

నందిగాం: రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ తల్లి సత్యమ్మ ఇటీవల మృతిచెందారు. జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ గురువారం తిలక్‌ను పరామర్శించారు. సత్యమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. కార్యక్రమంలో ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి, వైసిపి నాయకులు సిరిపురం తేజేశ్వరరావు, పడాల షణ్ముఖరావు, కల్లాడ సర్పంచ్ మడపాల తిరుపతిరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు.

29న వాహనాల వేలం

ఇచ్ఛాపురం: పట్టణంలో ఎక్సైజ్ కేసుల్లో సీజైన వాహనాలకు ఈ నెల 29న బహిరంగ వేలం వేయనున్నట్లు ఎస్ఐ గోవిందరావు తెలిపారు. అసిస్టెంట్ కమిషనర్, ఎస్ఇబి ఉత్తర్వుల మేరకు ఇచ్ఛాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఉదయం 11గంటలకు వేలం వేస్తామని, ఆసక్తిగల వారు పాటలో పాల్గొనాలని కోరారు.

విద్యార్థికి అభినందనలు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థి అంపలం కౌశిక్ ప్రతిభ కనబరిచినందుకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబూరు గోవిందమ్మ గురువారం అభినందించారు. హర్యానాలో ఉన్న కురుక్షేత్ర వర్సిటీ ఆధ్వర్యాన జరిగే జాతీయ ఐక్యతా క్యాంప్‌కు ఎంపికై, రజత పతకం సాధించిన విద్యార్థినిని ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ సతీష్‌కుమార్; అధ్యాపకులు అభినందించారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ గోవిందమ్మ

'ఎన్ఇఆర్' స్కూల్‌లో 'యూనియన్ ముస్కాన్'



పాసు పుస్తకం అప్లికేషన్‌ను అందజేస్తున్న 'ఎన్ఇఆర్'

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎన్ఇఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సెన్స్‌లో యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఆధ్వర్యాన విద్యార్థుల పేరున 'యూనియన్ ముస్కాన్' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఇందులో భాగంగా అకౌంట్లు ప్రారంభించారు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజియం సిద్ధార్థ కిరణ్ ముజుందార్, శ్రీకాకుళం రీజినల్ హెడ్ గుర్నాదరావు విద్యార్థులకు పాసు పుస్తకాలు, డిబెట్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా స్కూల్ చైర్మన్ నడుకుదిటి ఈశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులకు ఈ వయసు నుంచి ఆర్థిక పరమైన పరిజ్ఞానం అవసరమన్నారు. యూనియన్ బ్యాంకు చేపట్టిన ఈ కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. డిజిఎం ముకుందార్ మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన స్కూల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తేజ, స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీదేవి మహంతి, యూనియన్ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ప్రభుత్వ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్‌గా చందనరావు



చందనరావు

శ్రీకాకుళం అర్బన్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్‌గా తమ్మినేని చందనరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర చైర్మన్ కాకర్ల వెంకటరామిరెడ్డి నియామక ఉత్తర్వులను గురువారం విడుదల చేశారు. సంతబొమ్మాళి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర సహాయకులు చందనరావు పనిచేస్తున్నారు. ఈ నియామకంపై వైసిపి ఉపాధ్యాయ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

వెబ్‌సైట్‌లో గ్రీవెన్స్ స్వీకరణ

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో క్షయ నివారణా సంస్థ పరిధిలో ఏడాది కాలం పాటు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేసేందుకు డాట్స్, టిబి, హెచ్‌ఐవి సూపర్ వైజరుతో పాటు మూడు ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు ఇటీవల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. వారి నుంచి ఈ నెల 24 నుంచి 26 వరకు వెబ్‌సైట్ ద్వారా గ్రీవెన్స్ స్వీకరిస్తున్నట్టు అదనపు డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎన్.అనురాధ ఒక ప్రకటనలో తెలిపారు. డాట్స్ సూపర్ వైజర్ పోస్టుకు 120 మంది, ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులకు 101 మంది దరఖాస్తులు చేసుకున్నట్లు పేర్కొన్నారు. రోస్టర్ ఆధారంగా దరఖాస్తులు కోరినట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాంగ్రెస్ పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా 'సనపల'



అన్నాజీరావు

ఆమదాలవలస : జిల్లా పార్లమెంటరీ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి సనపల అన్నాజీరావును నియమించినట్లు పిసిసి నుంచి గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి జిల్లా పార్లమెంట్ ఇన్‌ఛారిగా నియమించినందుకు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, ఎఐసిసి మాజీ అధ్యక్షులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, రాష్ట్ర పిసిసి అధ్యక్షులు డాక్టర్ సాకే శైలజనాథ్, రుద్రరాజు పద్మరాజు, జిల్లా డిసిసి అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతిలకు కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తూ పదవికి న్యాయం చేకూర్చుతానని తెలిపారు.

కాంగ్రెస్ నూతన కార్యవర్గానికి అభినందనలు

రణస్థలం రూరల్: ఎపి పిసిసి అధ్యక్షునిగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గిడుగు రుద్రరాజు, పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్లు మస్తాన్ వలీ, సుంకర పద్మశ్రీ, జంగా గౌతం, రాకేష్ రెడ్డిలు, కార్యక్రమాల కార్యాచరణ కమిటీ అధ్యక్షునిగా మాజీ ఎంఎంపీ ఎం.ఎం.పళ్లంరాజు, ప్రచార కమిటీ చైర్మన్‌గా మాజీ ఎంపీ హర్ష కుమార్, సోషల్ మీడియా కమిటీ చైర్మన్‌గా తులసీరెడ్డిలను ఎఐసిసి నియమించింది. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులకు కాంగ్రెస్ పార్టీ ఎచ్చెర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి, బిసి సెల్ రాష్ట్ర కన్వీనర్ కొత్తకోట్ల సింహాద్రినాయుడు, డిసిసి ప్రధాన కార్యదర్శి కె.లక్ష్మి, కె.జోగినాయుడు, ఎ.జగదీష్ నాయుడు, ఎం.గణేష్, ఎం.రమణ, బి.రాధాకృష్ణ, వై.సూర్యనారాయణలు శుభాకాంక్షలు తెలిపారు.

బైక్ ర్యాలీని విజయవంతం చేయాలి

సోంపేట: మూడు రాజధానులకు మద్దతుగా మండలంలోని కొర్లాం నుంచి ఇచ్ఛాపురం వరకు జరిగే బైక్ ర్యాలీని విజయవంతం చేయాలని జెడ్‌పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావు ఒక ప్రకటనలో కోరారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు ఈ బైక్ ర్యాలీని ప్రారంభిస్తారని, కార్యకర్తలు, అభిమానులు, పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



ఒటిఎస్ పత్రాలను అందిజేస్తున్న ఎంపిపి దేవదాస్‌రెడ్డి, సర్పంచ్ సింహాచలం

లబ్ధిదారులకు 'గృహ హక్కు' వరం

ప్రజాశక్తి- కంచిలి

ఒటిఎస్ లబ్ధిదారులకు జగనన్న శాశ్వత గృహ హక్కు పథకం వరం లాంటిదని ఎంపిపి పైల దేవదాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని బొగాబేని సచివాలయం వద్ద గురువారం జరిగిన కార్యక్రమంలో 19 మంది లబ్ధిదారులకు శాశ్వత గృహహక్కు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి దేవదాస్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదల సొంత ఇంటి కలను ముఖ్యమంత్రి జగన్ నెరవేరుస్తున్నారన్నారు. లబ్ధిదారులకు తమ ఇంటిపై సంపూర్ణ హక్కు లభిస్తుందన్నారు. మిగిలిన వారు సైతం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సర్పంచ్ గొనప సింహాచలం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపిపితో పాటు పిఎసిఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, వైసిపి మండల అధ్యక్షుడు వజ్జ మత్యుంజయం, నాయకులు లడ్డు కేశవ్‌పాత్రో, డి ధర్మారావు, రామారావు, సూర్యనారాయణరెడ్డి, జయరాం, తదితరులు పాల్గొన్నారు.

వాలంటీరు పోస్టులకు ఇంటర్వ్యూలు

నౌపడ: సంతబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ ఉమా సుందరి వాలంటీర్ అభ్యర్థులకు గురువారం మౌఖిక పరీక్షలు నిర్వహించారు. మండలంలో ఖాళీగా ఉన్న 14 వాలంటీర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు అర్హత పత్రాలు పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలో ఖాళీగా ఉన్న వార్డు వాలంటీరకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఎంపిడిఒ రామారావు గురువారం ఇంటర్వ్యూలు చేశారు. మొత్తం 17 మందికి 11మంది అభ్యర్థులు ఇంటర్వ్యూలకు హాజరయ్యారని ఎంపిడిఒ తెలిపారు. ఇందులో తేలుకుంచి, కొలిగాం, బుర్జపాడు, కొఠారి, బిర్లంగి, ఈదుపురం గ్రామ పంచాయతీలకు సంబంధించి 11మంది హాజరయ్యారని తెలిపారు. ఈ ఇంటర్వ్యూలో ఉపాధి హామీ ఎపిడి భాస్కర ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



పొందూరు : అన్నదానంలో పాల్గొన్న యాత్రికులు

పలుచోట్ల అన్నదానం

రాపాకలో...

పొందూరు : మండలంలోని రాపాక రామాలయం వీధిలో శివ స్వాముల ఆధ్వర్యాన అన్నదానం నిర్వహించారు. ఏటా శివ స్వాములు పోలి పాడ్యమి సందర్భంగా అన్నదానం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ కార్యక్రమానికి సరిసర గ్రామాలకు చెందిన యాత్రికులు పాల్గొన్నారు.

సైరిగాంలో...

జలుమూరు: కార్తీక మాసం చివరి రోజైన పోలి పాడ్యమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో అన్నసంతర్పణలు నిర్వహించారు. మండలంలోని సైరిగాం గ్రామంలో గ్రామస్తులు నాలుగు వేల మందికి అన్నదానం చేపట్టారు. ఈ సందర్భంగా అల్లాడ పిఎసిఎస్ చైర్‌పర్సన్ పొన్నాన ముసలినాయుడు మాట్లాడుతూ ప్రతి ఏటా పోలి పాడ్యమి సందర్భంగా గ్రామంలో అన్నసంతర్పణ చేస్తున్నామన్నారు.

ఊసవానిపేటలో...

ఆమదాలవలస : పురపాలక సంఘ పరిధిలోని ఊసవానిపేటలో ఉన్న ఉమా మల్లేశ్వర శివాలయాన్ని టిడిపి పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షులు కూన రవికుమార్ దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. అన్నదానంలో రెండు వేల మంది యాత్రికులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఇంజరాపు విశ్వనాథం, టిడిపి నాయకులు కూన నాగు, నవిరి చిన్నారావు, తంగి శంఖర్, నాగళ్ల మురళి పాల్గొన్నారు.




జలుమూరు : సైరిగాంలో అన్నదానంలో యాత్రికులు

సిఎం దృష్టికి సమస్యలు

పిఎసిఎస్...


కొత్తూరు : పిఎసిఎస్ అధ్యక్షులు చింతాడ సూర్యనారాయణ నరసన్నపేటకు వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డిని బుధవారం కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందజేశారు. మండలంలోని వంశధార నిర్వాసితులు సమస్యలను పరిష్కరించాలని కోరారు. అలాగే పారాపురం మినీ రిజర్వాయర్ వద్ద ఎత్తిపోతల పథకం పనులు వేగవంతం అయ్యేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. వీటిపై సానుకూలంగా సిఎం స్పందించారని సూర్యనారాయణ తెలిపారు.



కోటబొమ్మాళి : వినతిపత్రం అందిస్తున్న సర్పంచ్ కేశవరావు

సర్పంచ్ కేశవరావు

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురం పంచాయతీ సమస్యలను సిఎం జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్లు సర్పంచ్ గురువెల్లి కేశవరావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత పాలకులు పంచాయతీ అభివృద్ధికి ఎటువంటి పనులు చేయలేదని, నిధులు మంజూరు చేయాలని నరసన్నపేట వచ్చిన సిఎంకు వినతిపత్రం అందించినట్లు తెలిపారు. కోటబొమ్మాళి మండలంతోపాటు టెక్కలి, సంతబొమ్మాళి, జలుమూరు, సారవకోట మండలాలకు చెందిన ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్న హర్చింద్రపురం రైల్వే స్టేషన్‌లో అన్ని పాసింజరు రైళ్లతో పాటు తిరుపతి, హైదరాబాద్, మద్రాస్, తదితర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లను నిలిపేలా చూడాలని సిఎంను కోరానని అన్నారు. స్పందించిన ఆయన అభివృద్ధికి సహకరిస్తానని తెలిపారని చెప్పారు.



పోలాకి : జగన్‌ను కలిసిన కృష్ణారావు



కొత్తూరు : పుష్పగుచ్ఛం అందజేస్తున్న సూర్యనారాయణ

కృష్ణారావు...

పోలాకి: కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ప్రతినిధి కణితి కృష్ణారావు సిఎం జగన్మోహన్‌రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మండలంలోని రాజకీయ పరిస్థితులను జగన్‌కు ఆయన వివరించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం విజయవంతంగా నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే రెడ్డి శాంతిని అభినందించారని తెలిపారు.



మాట్లాడుతున్న గంగాధరరావు

'108, 104' సేవలు విస్తృతం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా సకాలంలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని 108, 104 రాష్ట్ర ఇన్‌ఛార్జిలు కె.గంగాధరరావు, సునీల్‌లు కోరారు. నగరంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లాలో 108, 104 వాహనాల నిర్వహణ, అందిస్తున్న వైద్య సేవలపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహనాలు మరమ్మత్తులకు గురి కాకుండా సకాలంలో మెంటినెన్స్ పనులు చేపట్టాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నిర్దేశించిన మేరకు గ్రామీణ ప్రాంతాల్లో సేవలు అందించాలన్నారు. ఉద్యోగుల పనితీరును వారు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఉద్యోగులు క్షేత్ర స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల్ని నివారించేందుకు కృషి చేస్తామని హామీనిచ్చారు. ఎక్కడైనా లోపాలు ఉన్నట్టయితే నేరుగా కేంద్ర కార్యాలయానికి నివేదించాలని సూచించారు. సమావేశంలో 108 జిల్లా మేనేజర్ నజీర్ హుస్సేన్, 104 సేవల జిల్లా మేనేజర్ ఉంగటి లక్ష్మణరావు, జిల్లా ఫ్లీట్ మేనేజర్ భాస్కరరావు పాల్గొన్నారు.



మహాసభకు వెళ్తున్న డప్పు కళాకారులు

రాష్ట్ర మహాసభలకు దళిత డప్పు కళాకారులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఏలూరు జిల్లా కేంద్రంలో ఈ నెల 25, 26, 27 తేదీల్లో నిర్వహించనున్న పడిఎస్‌యు రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నారు. ఈ సభలకు అరుణోదయ సాంస్కృతిక సమాఖ్యకు అనుబంధంగా ఉన్న దళిత డప్పు కళాకారుల సంఘం సభ్యులు పన్నెండు మంది డప్పు కళా ప్రదర్శన బృందంగా పాల్గొనడానికి వెళ్తున్నారు. అరుణోదయ రాష్ట్ర నాయకులు సన్నశెట్టి రాజశేఖర్, జిల్లా కార్యదర్శి బి.జగన్నాథరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిత్రి లక్ష్మణరావులు హర్షం ప్రకటించారు. ప్రజా ఆకాంక్షలను కళారూపాల ద్వారా తెలియజేసి చైతన్యం రగిలించే కర్తవ్యంలో దళిత డప్పు కళాకారులు భాగస్వామ్యం పొందుతున్నారని అన్నారు. గురువారం శ్రీకాకుళం రోడ్ రైల్వేస్టేషన్ నుంచి రైలు ప్రయాణం సాగిస్తున్న కళాకరులకు అరుణోదయ పక్షాన జేజేలు పలుకుతూ వీడ్కోలు చెప్పారు. ఈ బృందంలో గొర్లె రవి, నిమ్మల సంజీవరావు, అడ్డసారి ప్రదీప్, బిడ్డిక సాగర్, గంట బాలు, మీసాల వెంకటరావు, నిమ్మల నాగేశ్వరరావు, పెంటల సూర్యారావు, గువ్వాడ అప్పలస్వామి, అరవ ఢిల్లీరావు, చింతాడ కరువులు, పాలక భాస్కరరావు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సూర్యనారాయణ

'నాడు-నేడు' పనులు పరిశీలన

ప్రజాశక్తి- బూర్జ

భవన నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని నాడు-నేడుతో చేపడుతున్న తోటవాడ, కె.కె.పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, బూర్జలోని అంగన్వాడీ భవనం, కొల్లివలసలోని కెజిబివి భవన నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నాడు-నేడు పథకం కింద గ్రామాల్లో పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీలు, కెజిబివి భవన నిర్మాణాలను చేపడుతుందని తెలిపారు. వీటిని నిర్మాణాల్లో ఎటువంటి లోపాలున్నా ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఆయనతోపాటు తోటవాడ, కురుంపేట, ప్రధానోపాధ్యాయులు సోమేశ్వరరావు పద్మావతి, ప్రిన్సిపాల్ గాయత్రి, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఎం.వి.పి.కె.నాయుడు, సచివాలయ ఇంజినీరింగ్ సిబ్బంది ఉన్నారు.



నిత్యావసర సరుకులు, బియ్యం అందజేస్తున్న మామిడి శ్రీకాంత్

బాధితులకు శ్రీకాంత్ సహాయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని వెంకటాపురం పంచాయతీ ఎగువ బందపల్లి గ్రామంలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు గురువారం రాత్రి రాష్ట్ర తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ సహాయాన్ని అందించారు. 9 కుటుంబాలకు బట్టలు, దుప్పట్లు, బియ్యం ప్యాకెట్లు, కూరగాయలు పంపిణీ చేశారు. బాధితులతో మాట్లాడి, ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులకు ప్రభుత్వపరంగా రావాల్సిన సహాయాన్ని అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వెంకటాపురం సర్పంచ్ బెజ్జి జయమ్మ, బాణాపురం సర్పంచ్ పెద్దింటి చంద్రరావు, ఇలైపురం సర్పంచ్ గౌరీస్, పెద్ద పద్మాపురం ఎంపిటిసి ప్రతినిధి ఉర్లాన ఋషి, సర్పంచ్ ప్రతినిధి బెజ్జి పాపారావు, శేషగిరి, ఫాల్గుణరావు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చక్కని అవకాశం



పొందూరు : వృద్ధురాలితో మాట్లాడుతున్న స్పీకర్ సీతారాం

ప్రజాశక్తి- పొందూరు

గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా సమస్యలు గుర్తించి వాటి పరిష్కరించడానికి ఇది ఒక చక్కని అవకాశమని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. మండలంలోని ధర్మపురంలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకు తిరుగుతూ సంక్షేమ పథకాలు వివరిస్తూ సమస్యలు తెలుసుకుంటూ పరిష్కార మార్గాన్ని చూపిస్తూ ముందుకు సాగారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షులు పప్పల రమేష్‌కుమార్, సర్పంచ్ మొదలవలస పాపారావు, టౌన్ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు, వైస్ ఎంపిపి వండాన వెంకటరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బాడన సునీల్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కిల్లాన సూర్యారావు, మొదలవలస మురళీకృష్ణ, మొదలవలస వెంకటరమణ, యతిరాజుల భీమరాజు, మొదలవలస వైకుంఠం, మాజీ సర్పంచ్ చల్లా ముఖలింగం పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని వెంకటాపురంలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించారు. కార్యక్రమంలో ఎంపిపి ప్రతినిధి రొక్కం బాలకృష్ణ, జెడ్‌పిటిసి మీసాల సీతంనాయుడు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు షేక్ చాంద్ భాష, సర్పంచ్‌లు బొంతు అరుణ, జగ్గురోతు సత్యనారాయణ, పంచాయతీ రాజ్ ఎఇ అప్పన్న, విద్యాశాఖ ఎఇ అప్పలనాయుడు, వెటర్నరీ డాక్టర్ గాయత్రి, ఎఒ మహేష్‌నాయుడు పాల్గొన్నారు.



లావేరు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

ఇంటి పన్ను చెల్లించకుంటే నోటీసులు

మున్సిపల్ చైర్మన్ గిరిబాబు

ప్రజాశక్తి- పలాస

ఇంటి పన్ను సకాలంలో చెల్లించకపోతే నోటీసులు జారీ చేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధికారులకు ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో గురువారం మున్సిపల్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.4.50 కోట్లు ఇంటి పన్ను బకాయిలు ఉన్నాయని, త్వరగా ఇంటి పన్ను బకాయిలను వసూలు చేయాలని అధికారులకు ఆదేశించారు. కోట్ల రూపాయల్లో బకాయిలు ఉంటే మున్సిపాలిటీ ఎలా అభివృద్ధి చెందుతుందని అధికారులను ప్రశ్నించారు. మున్సిపాలిటీలోని ఎనిమిదో వార్డులో జరగనున్న గడప గడపకు వైసిపిని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు సచివాలయ సిబ్బందికి సూచించారు. మున్సిపల్ అధికారులు, వైసిపి నాయకులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. వార్డు పరిధిలో పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించాలని కోరారు.

స్థల పరిశీలన

తాళభద్ర సమీపంలో మురుగునీరు శుద్ధిచేసే ప్లాంట్ ఏర్పాటుకు గురువారం బల్ల గిరిఆబు స్థల పరిశీలన చేశారు. భూగర్భ జలాలు కలుషితం కాకుండా మురుగునీటిని శుద్ధి చేసి, మరలా భూగర్భ జలాల్లోకి విడిచిపెట్టనున్నట్లు చెప్పారు. ఆయనతోపాటు మున్సిపల్ కమిషనర్ టి.రాజగోపాల్, మునిసిపల్ అధికారులు, సచివాలయం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చైర్మన్ గిరిబాబు



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

తీర్మానాలే మిగులుతున్నాయి

జి.సిగడాం: ప్రతి మండల సమావేశంలోనూ చేసిన తీర్మానాలు అలాగే ఉండిపోతున్నాయని, పనులు మాత్రం కావడం లేదని సభ్యులు అధికారులను నిలదీశారు. ఎంపిపి మీసాల సత్యవతి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. మడ్డువలస కాలువ ద్వారా వి.ఆర్.పేట నుంచి మధుపాం వరకు ఈ ఖరీఫ్ సీజన్‌లో సకాలంలో నీరు అధికారులు ఇవ్వకపోవడంతో వందల ఎకరాలు సాగు చేయలేకపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీల్లో నిధులను ప్రభుత్వం తీసుకోవడంతో కాలువల పూడికతీతలు, రోడ్లు కూడా వేయలేని పరిస్థితి ఉందని వాపోయారు. గొబ్బూరు సర్పంచ్ చిన్నారావు మాట్లాడుతూ సర్పంచ్ ప్రేమేయం లేకుండా హౌసింగ్ అధికారులు తమ గ్రామంలో ఇష్టానుసారంగా సెంక్షన్ చేసుకుంటూ పోతున్నారని మండిపడ్డారు. వీటిపై విచారణ చేపట్టాలని కోరారు. అలాగే వైద్యాధికారి మాట్లాడుతూ రోజూ ఏదో ఒక గ్రామంలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని అన్నారు. మండల ప్రత్యేక ఆహ్వానితులు మీసాల రమణ మాట్లాడుతూ ఒక తీర్మానం రాసుకుంటూ వచ్చే సమావేశం కల్లా తీర్మానంలో ఉన్న ప్రతి సమస్యనూ పరిష్కరిస్తామని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి కాయల రమణ, వైస్ ఎంపిపి సాధ్వీమణి, తోలేటి వెంకటరమణ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ శ్రీనివాసరావు, తహశీల్దార్ పప్పల వేణుగోపాలరావు, పంచాయతీరాజ్ ఎఇ శ్రీవల్లి, ఎఒ శారద, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాయుడు, ఎపిఎం రెడ్డి రామకృష్ణ, ఎపిఒ సత్యనారాయణ, అంగన్వాడీ సూపర్‌వైజర్ రజని, వెటర్నరీ డాక్టర్ సునీల్, డాక్టర్ శ్రీహరిత పాల్గొన్నారు.



పంపుసెట్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

మోటారు పంపుసెట్ మరమ్మతులు

నౌపడ: సంతబొమ్మాళి మండలం యామాలపేట పంచాయతీలో గురువారం సర్పంచ్ ప్రతినిధి సంజీవ్‌కుమార్ వాటర్ ట్యాంక్ మోటారు మరమ్మతులు చేయించారు. గత కొద్ది రోజులుగా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు పడుతుండడంతో సిబ్బందితో మోటర్ పంపుసెట్ మరమ్మతులు చేయించారు. తాగునీటి సరఫరాను పునరుద్ధించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా బోధన

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యార్థుల అభిరుచులకు అనుగుణంగా బోధన చేసి శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలోకి తీసుకురావాలని ఎంఇఒ దుప్పల రామారావు అన్నారు. పట్టణంలోని మండల రిసోర్స్ కేంద్రంలో ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమంలో గురువారం పాల్గొని మాట్లాడారు. విద్యార్థులలో పాటలు, కథల రూపంలో ఆసక్తిని పెంచి గణితం ,తెలుగు, ఇంగ్లీష్ తదితర అన్ని అంశాలపై పిల్లలందరికీ ధారాళంగా చదవడం రాయడం వచ్చేటట్లు ప్రాథమిక స్థాయిలో చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులందరిపై ఉందని గుర్తుచేశారు. విద్యతో పాటు పిల్లలు ఆహ్లాదంగా ఉండేందుకు విభిన్న రకాల ఆటలతో వినోధ కార్యక్రమాలూ పాఠశాలపై అభిరుచిని పెంచుతాయని తెలిపారు. మండల విద, సంక్షేమ అధికారి పైడి కూర్మా రావు మాట్లాడుతూ ప్రభుత్వం విద్య కోసం అందిస్తున్న జగనన్న విద్యా కానుకలు, అమ్మఒడి పథకం, జగనన్న గోరుముద్ద విషయాలను పేరెంట్స్ కమిటీలతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు కూడా పిల్లల చదువు కోవాల్సిన ఆవశ్యకత, పాఠశాల ప్రాముఖ్యత, ప్రభుత్వ పథకాలపై సరైన అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల ఉపాధ్యాయులు, రిసోర్స్ పర్సన్లు సన్యాసి బట్లు, శ్రీనివాసరావు, రఘు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఇఒ రామారావు



ఆధార్ అప్‌లోడ్ చేస్తున్న రాము

ఆధార్ స్పెషల్ డ్రైవ్‌కు స్పందన

జి.సిగడాం: మండలంలోని పెంట సచివాలయంలో ఆధార్ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా సేవలను గురు, శుక్రవారాలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో గురువారం స్థానికులు అధిక సంఖ్యలో తరలిరావడంతో స్పందన లభించిందని ఆధార్ నిర్వాహకులు రాము తెలిపారు. శుక్రవారమూ ఆధార్ కు సంబంధించిన అన్ని రకాల సేవలను అందజేయనున్నట్లు తెలిపారు. సచివాలయ పరిధిలోని గ్రామస్తులు ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యదర్శి సురేష్ కుమార్, డిజిటల్ అసిస్టెంట్ ప్రసాద్, వెల్ఫేర్ అసిస్టెంట్ మనోజ్‌కుమార్, చైతన్య, కుసుమ, అనసూయ పాల్గొన్నారు.

జలమే జీవనాధారం

ప్రజాశక్తి- కవిటి

జలమే జీవనాధారమని, నీటిని పొదుపుగా వాడుకుంటూ, నీటి ప్రాముఖ్యతను భవిష్యత్ తరాలకు వివరించాలని కపాసుకుద్ది సర్పంచ్ కాయ దమయంతి, మాజీ సర్పంచ్ పులకల శ్రీరాములు అన్నారు. కపాసుకుద్ది పంచాయతీలో జలజీవన్ మిషన్ కార్యక్రమంపై గురువారం గ్రామసభ, ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా 2024 నాటికి ప్రతి ఇంటికీ సురక్షిత మంచినీటి కుళాయి సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా కపాసుకుద్ది పంచాయతీలో సర్పంచ్ అధ్యక్షతన, పంచాయతీ కార్యదర్శి సెక్రటరీగా కమిటీలు ఏర్పాటు చేసినట్లు జలజీవన్ మిషన్ ఇచ్ఛాపురం సబ్ డివిజన్ టీమ్ లీడర్ జె.వెంకటరమణ తెలిపారు. కార్యక్రమంలో కపాసుకుద్ది సర్పంచ్ ప్రతినిధి కాయ భీమసేన్, పంచాయతీ కార్యదర్శి రూప, జలజీవన్ మిషన్ సభ్యులు హారిక, సుధీర్, భాగ్యలక్ష్మి, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, అంగన్వాడీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పలాస: ప్రకృతిని పరిరక్షించాలని ప్రముఖ న్యాయవాది రామకృష్ణ అన్నారు. మున్సిపాలిటీలోని లేబర్ కాలనీ, వినాయక గుడి వద్ద గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యాన ఆయన తన కుటుంబసభ్యులు, భార్య శ్యామల, కుమారుడు జ్యోషికతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో బోనెల గోపాల్; బి.ఓంకార్, ఉపాధ్యాయులు దాసరి శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, శంకరరావు, చిన్నచారి, శ్రీనివాసరావు, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



కవిటి : కపాసుకుద్దిలో ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు



పలాస : మొక్కలు నాటుతున్న న్యాయవాది రామకృష్ణ



దర్శించుకుంటున్న ఎంపీ దంపతులు

కొత్తమ్మతల్లిని దర్శించుకున్న ఎంపీ

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

మండల కేంద్రంలోని కొత్తమ్మతల్లి అమ్మవారిని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన తల్లి విజయ, భార్య, కుమార్తెలతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం ఆలయ సిబ్బంది పప్పల రామచంద్రరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గోవిందరాజులు, మండల అధ్యక్షులు రమేష్ వారికి ఘన స్వాగతం పలికారు. ప్రసాదాన్ని ఇచ్చి కొత్తమ్మతల్లి విశిష్టతను వారికి వివరించారు. కార్యక్రమంలో నాయకులు వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణరావు, దేవాది సింహాద్రమ్మ, పట్ట సింహాచలం, లాడి శ్రీను, లీలామోహన్, శిమ్మ నారాయణరావు, కోరాడ గోవిందరావు, టి.సునీల్, తదితరులు పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న సర్పంచ్ వెంకటసత్యం

'ఉపాధి' పనులు ప్రారంభం

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని వైకుంఠపురం పంచాయతీ అల్లిపల్లిగూడ గిరిజనులు మొదటిసారి జాబ్ కార్డు పొందడంతో గురువారం ఉపాధి హామీ పనులను సర్పంచ్ బొడ్డేపల్లి వెంకట సత్యం గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏ కుటుంబమూ ఆకలితో అలమటించకుండా వంద రోజులు పని కల్పించాలన్న ముఖ్య ఉద్దేశంతో ఈ పథకం అమలవుతుందని అన్నారు. గ్రామంలో ఉపాధి పనుల కోసం తాము పలుమార్లు అధికారులకు విన్నవించుకున్నాని అన్నారు. ఎట్టకేలకు తమ గ్రామంలో ఉపాధి పని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, తమ్మినేని వెంకటరావు, కూలీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

సృజనాత్మకతను వెలికితీయాలి

ప్రజాశక్తి- నందిగాం

విద్యార్థుల్లో దాగివున్న సృజనాత్మకతను వెలికి తీయాలని నౌగాం జెడ్‌పి హెచ్‌ఎస్ హెచ్‌ఎం ఎం.శ్రీనివాసరావు అన్నారు. పాఠశాల సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు జన్ని చిరంజీవి, ఎస్.ఢిల్లేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు మీలో ఎవరు కోటీశ్వరులు అనే మోడల్‌లో గురువారం క్విజ్ పోటీలు నిర్వహించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా పాతపద్ధతిలో కాకుండా ఎల్ఇడి. తెర ద్వారా విద్యార్థులకు నూతన పద్ధతిలో క్విజ్ నిర్వహించారు. సమాధానాలు చెప్పలేని వారికి హెల్ప్‌లైన్ విధానాన్ని అనుసరిస్తు నిర్వహించిన క్విజ్ పలువురుని అలరించింది. ఉపాధ్యాయులు విద్యార్థులకు కొత్త విధానాల్లో పాఠ్యాంశాల బోధనకు ఉపయోగప డతాయని హెచ్‌ఎం శ్రీనివాసరావు అన్నారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఎం.శివచరణ్, బి.అవినాష్, పి.త్రిషలకు నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు డొంకాన పాపారావు, బొడ్డేపల్లి శేషగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న గౌరీకుమార్

వైఎస్‌ఆర్ బీమా అందజేత

ప్రజాశక్తి- కొత్తూరు

మండలంలోని కర్లెమ్మ పంచాయతీ నేతాజీనగర్‌కు చెందిన లోతుగెడ్డ రవికిషోర్ బుధవారం మృతి చెందారు. వారి కుటుంబానికి వైఎస్ఆర్ బీమా వర్తించడంతో తక్షణ సాయం కింద రూ.పది వేలు నగదును ఎంపిటిసి వడ్డీ గౌరీకుమార్ మృతుడి భార్య సంతోష్‌కుమారికి గురువారం అందజేశారు. మిగిలిన మొత్తం నామినీ పేరున బ్యాంకు అకౌంట్‌లో జమవుతాయని తెలిపారు. విషయం తెలుసుకున్న వైస్ ఎంపిపి రవికిషోర్, మండల పరిషత్ ఉపాధ్యక్షులు లోతుగెడ్డ తులసీవప్రసాదరావులు మృతుడు తండ్రి తిరుపతిరావును పరామర్శించారు. వీరి వెంట వెంట మాజీ సర్పంచ్ ఎల్.తాతబాబు ఉన్నారు.